బ్రిడ్జి సమస్య తీరేనా?

- ప్రమాదకరంగా గగ్గటూరు – రాయపాడు బ్రిడ్జి బ్రిడ్జి
- గతంలో ఇద్దరు మృతి

పాణ్యం: మండల పరిధిలోని గగ్గటూరు –రాయపాడు గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. దీంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గగ్గటూరు గ్రామం ముందు ఉన్న ఊరువాగుపై గతంలో బ్రిడ్జిని నిర్మించారు. ఎప్పుడో నిర్మించిన ఈ బ్రిడ్జి వాగుకు అతి తక్కువ ఎత్తుగా ఉంది. బ్రిడ్జిపై వెళ్లే వాహనాలు లోయలోకి దిగి ఎక్కినట్లు ఉంటుంది. చిన్న పాటి వర్షానికే వాగు ఎక్కి నీరు ప్రవహిస్తుంది. వర్షకాలంలో బ్రిడ్జిపై 5–8అడుగుల వరకు నీరు ప్రవహిస్తుంది. రెండు గ్రామాల రాకపోకలు నిలిచిపోతాయి. ఒక్కోసారి రాకపోకలు నెల వరకు నిలిచిపోతాయి. నీరు తగ్గితే బ్రిడ్జిపై రాకపోకలు సాగుతాయి. అది కూడా ఎంతో జాగ్రత్తగా వెళ్లాల్సి ఉంటుంది. బ్రిడ్జిపై అడుగు మందంలో పాచి పేరుకుపోయింది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అంతే సంగతే. అంతేకాక బ్రిడ్జికి అటుఇటు ఇనుప కమ్ములు (అంగ్లేర్స్)కూడా లేవు. నీరు ఏమాత్రం ప్రవహిస్తున్నాయనే విషయం కూడా తెలియని పరిస్థితి. గతంలో వినాయ నిమజ్జనం రోజునే ఓ బాలుడు బ్రిడ్జిపై జారి వాగులోకి పడి మృతి చెందాడు. అదే విధంగా కర్నూలుకు చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి కారు తోసహా వాగులోపడి మృతి చెందాడు. బ్రిడ్జి పైకి ఎక్కిన వెంటనే ప్రమాదకరంగా మలుపు ఉంటుంది.


నీటి ప్రవాహంలో బ్రిడ్జి దాటుతున్న వాహనాలు (ఫైల్)


ప్రమాదకరంగా తగ్గులో ఉన్న బ్రిడ్జి

అప్పుడప్పుడు వాహనాలు అదుపుకాక చాలా మంది వాగులో పడిన సందర్భాలు ఉన్నాయి.

వారంలో రెండు రోజులు వాహనాల రద్దీ

గగ్గటూరు పక్కనే కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇక్కడ ప్రతి ఆది, మంగళ వారాల్లో విశిష్ట పూజలు జరుగుతాయి. స్వామివారిని దర్శించుకునేందుకు ఆళ్లగడ్డ, కొవెలకుంట్ల, చాగలమర్రి, దొర్నిపాడు తదితర మండలాల నుంచి వేలాదిగా భక్తులు ఈ దారి నుంచి ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రతి మంగళ, ఆదివారాలో ద్విచక్ర, ట్రాక్టర్లు, జీపులు, ఎడ్ల బండ్లు, లారీలపై భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వర్షాకాలంలో రోజులపాటు నీటి ప్రవాహం మూలంగా రాకపోకలు నిలిచి పోయి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామాల ప్రజలకు అధికారులకు వినతులు సమర్పించినా స్పందన లేదు. ఇప్పటికైన అధికారులు చర్యలు చేపట్టి బ్రిడ్జి ఎత్తు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు

గ్రామ ప్రజల విన్నపం మేరకు అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బ్రిడ్జిని స్వయంగా పరిశీలించారు. బ్రిడ్జి వద్ద జరుగుతున్న ప్రమాదాలపై ప్రజలను, భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలోనే దాదాపుగా రూ.4.50 కోట్లకు వరకు ప్రతిపాదనలు తయారుచేసి పంపారు. అనుమతులురాని కారణంగా పనులు చేపట్టలేదు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. కొన్నేళ్లుగా గగ్గటూరు, రాయపాడు గ్రామాల ప్రజలు, కొత్తూరుకు వచ్చే భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అనేక సార్లు బైక్‌లు అదుపు తప్పి వాగులో పడి ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సద్దల శ్రీనివాసరెడ్డి గగ్గటూరు

అనుమతులు రాలేదు

గత ప్రభుత్వంలో నూతన బ్రిడ్జి నిర్మాణం కొరకు రూ. 4.50కోట్లతో ప్రతిపానదలు పంపాం. ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. మరోమారు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం.

– ఉసేనయ్య, ఏఈ ఆర్‌అండ్‌బీ బనగానపల్లె డివిజన్

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ నాగార్జునరెడ్డి



గడివేముల: గడివేముల ఎస్‌ఐగా సీసీ నాగార్జున రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అన ంతరం ఆయన మా ట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కో రారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడుతుంటే సెల్ నంబర్ 9121101097 ఫోన్ చేయాలని, పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆడపిల్లల భద్రత... అందరి బాధ్యత

కల్లూరు: ఆడపిల్లల భద్రత అనేది కేవలం ఆలోచన కాదని, ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయం దగ్గర ఎమ్మెల్యే, ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ మౌమితకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో జరిగిన సంఘటనలో డాక్టర్ మౌమితపై అత్యాచారం చేసి హత్య చేసిన రేపిస్టులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లెల రాజశేఖర్, పార్వతమ్మ, సుభద్రమ్మ, శ్రీరాములు, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్‌కు చెందిన అచ్యుత్, పవన్ కళ్యాణ్, అమూల్య, సింధుజ, శ్రావ్య, మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

పోలకల్‌ను సందర్శించిన సీఐ

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామాన్ని సోమవారం కోడుమూరు సీఐ ఎండీ తబ్రేజ్ సందర్శించారు. ఒకప్పటి ఫ్యాక్షన్ గ్రామమైన పోలకల్‌ను ఆయన స్థానిక పోలీస్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామంలోని పాత నేరస్తులు, నేరాల వివరాలు, శిక్షపడిన కేసులను హెడ్‌కానిస్టేబుల్ తిమ్మప్పను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని కొంత మంది పాత రౌడీషీటర్ల ఇళ్లను, వారి పరిస్థితులను తెలుసుకున్న సీఐ పాతనేరస్తులు, రౌడీషటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని పోలీస్‌లను ఆదేశించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన పాత కేసుల రికార్డులను పరిశీలించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు మండలం, ఎస్‌ఏపీ క్యాంప్ సమీపంలోని ఇల్లూరు నగర్‌కు చెందిన పింజర్ హస్సన్ మియా(44) ఈ నెల 15వ తేదీన కర్నూలు నగరం నుంచి పూడిచెర్ల వద్ద గల హెచ్–8 హోటల్‌కు ఏపీ 21 టీయు 7408 నంబర్ తన ఆటోలో కూరగాయలు తీసుకొని వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో కర్నూలుకు తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో నన్నూరు నారాయణ బాలికల కళాశాల వద్ద కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన హస్సన్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య పింజరి హస్సన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

కర్నూలు సిటీ: స్థానిక మాధవీనగర్‌లోని సాయిసుబ్బయ్య రవీంద్ర ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో సోమవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య మాట్లాడుతూ.. కాలం మారినా, దూరం పెరిగినా చెరిగిపోని అనుబంధం, అన్నా చెల్లెలు, అక్కా, తమ్ముళ్ల బంధమని అన్నారు. అనంతరం స్కూల్‌లో బాలురకు బాలికలు రాఖీలు కట్టి రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలుశిక్ష

కర్నూలు (లీగల్): కర్నూలు త్రీటౌన్ పరిధిలోని అరోరా నగర్‌కు చెందిన యాదవ కళ్యాణిని వేధింపులకు గురిచేసిన భర్త యాదవ వేణుగోపాల్, మరో వ్యక్తి కురువ శేఖర్‌బాబుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.సరోజనమ్మ సోమవారం తీర్పు చెప్పారు. 2017లో కళ్యాణిపై అనుమానంతో ఆమె భర్త గోపాల్ మద్యం తాగి వచ్చి మానసికంగా, శారీరకంగా వేధించాడు. ఆమె భరించలేక అరోరా నగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఈ విషయం తెలుసుకుని భర్త, కురువ శేఖర్ అనే వ్యక్తి అరోరా నగర్‌కు వెళ్లి కళ్యాణి, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచారు. ఘటనపై కళ్యాణి ఫిర్యాదు మేరకు కర్నూలు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిపై చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో 6 నెలల జైలు శిక్ష, రూ.4 వేలు జరిమానా, 2వ నిందితుడికి 6 నెలల జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

చిరంజీవి అభిమానుల రక్తదానం

కర్నూలు(హాస్పిటల్): సినీనటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా అఖిల భారత చిరంజీవి యువత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్, డాక్టర్ కేజీ గోవిందరెడ్డి హాజరై రక్తదానం చేసిన అభిమానులను అభినందించారు.

పేదల ప్లాట్లకు నంబర్లు వేయండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు రెవెన్యూ పరిధిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల ప్లాట్లకు నంబర్లు వేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ నన్నూరు గ్రామానికి చెందిన నిరుపేదలకు గత ప్రభుత్వంలో సర్వే నంబర్ 1338/ఏ2 లో రెండవ విడత జగనన్న కాలనీ కింద సుమారు 900 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. అయితే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం మూలంగా రాళ్లపై నంబర్లు వేయలేదని, దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాసూంబాషా, వెంకటేశ్వర్లు, ఆకుల మధు, వాయిద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


మానసిక వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరులోని ప్రైవేటు పాఠశాలలో కల్లూరు ఫొటో, వీడియో గ్రాఫర్ల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ మహబూబ్ బాషా, గ్రంథాల మాజీ చైర్మన్ గంగాధరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. జీవితంలో మధురస్మృతులను మిగల్చేవే ఫొటోలు అని చెప్పారు. అనంతరం ఫొటోగ్రాఫర్ కళ్యాణ్ సహకారంతో మానసిక వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

మండలంలో మోస్తరు వర్షం


సి.బెళగల్‌లో సోమవారం మధ్యాహ్నం కురుస్తున్న వర్షం


కృష్ణనగర్ రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు

సి.బెళగల్: మండలంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండగా మధ్యాహ్నం 12 గంటల అనంతరం ఆకాశం మేఘాలతో కమ్ముకుని వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ఒక్కసారిగా భారీ చినుకులతో మొదలై దాదాపు అరగంటపాటు వర్షం కురిసింది. అదేవిధంగా సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. గత పదిరోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడిన ప్రజలు వర్షంతో కాస్తా ఉపశమనం పొందారు.

కల్లూరు: కర్నూలు నగరంలో సోమవారం వర్షం కురిసింది. కొన్ని రోజులుగా వేసవి కాలాన్ని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు ఆదివారం సాయంత్రం, సోమవారం కురిసిన వర్షంతో కొంతమేర ఉపశమనం చెందారు. కల్లూరు అర్బన్ కాలనీలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. 44వ జాతీయ రహదారి కృష్ణానగర్ ఐటీసీ కూడలి దాటిన అనంతరం వర్షం నీరు, ఇసుక రోడ్డుపై చేరింది. కృష్ణనగర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షం నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటు కౌన్సెలింగ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సిలింగ్ పూర్తయిందని ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి తెలిపారు. మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు 60 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా సోమవారం మండల పరిధిలోని పాఠశాలలకు చెందిన 14 మంది ఉపాధ్యాయులను పని సర్దుబాటు చేసినట్లు వారు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్స్‌లో గణితం–4, తెలుగు–01, ఇంగ్లిష్–02, బయాలజికల్ సైన్స్–02, సోషల్–05 ఖాళీలను సర్దుబాటు చేశారు. ఇంకా 46 మంది ఉపాధ్యాయులను ఉన్నతాధికారులు ఇతర మండలాలకు చెందిన ఉపాధ్యాయులను సర్దుబాటు చేయనున్నట్లు తెలిపారు.

బేకరీలో చోరీ

కర్నూలు: స్థానిక మద్దూర్‌నగర్‌లోని కిరణ్ బేకరిలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. రాఖీ పండుగ కోసం పెద్దఎత్తున బేకరీ ఐటమ్స్‌తో పాటు కూల్‌డ్రింక్స్, ఖరీదైన చాక్లెట్లను దుకాణం యజమాని కిరణ్ నిల్వచేశారు. ఆదివారం రాత్రి వ్యాపారం ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు బేకరీ షట్టర్‌ను పెకిలించి క్యాబిన్‌కు ఉన్న అద్దాలను పగులగొట్టి లోపలికి దూరి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.10 వేలు నగదు, బేకరీ ఐటమ్స్, కూల్‌డ్రింక్స్ మూటగట్టుకుని ఉడాయించారు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి దుకాణ యజమానికి సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకోగా దుకా ణంలోని తినుబండారాలన్నీ చెల్లాచెదురుగా పడివున్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ క్రైం పార్టీ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. సీసీ పుటేజీని సేకరించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. పక్కనే ఉన్న బ్లూస్టార్ టైలర్ దుకాణం షట్టర్‌ను పెకిలించేందుకు దొంగలు విఫలయ త్నం చేశారు. బాధితుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

వరుస చోరీలతో బెంబేలెత్తిస్తున్న దొంగలు

రెండు నెలల వ్యవధిలో స్టేషన్ పరిధిలో దాదాపు 7 చైన్ స్నాచింగ్స్ జరిగాయి. రెవెన్యూ కాలనీలో లక్ష్మీదేవి, గణేష్‌నగర్‌కు చెందిన హేమసాయి, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీకి చెందిన రామలక్ష్మమ్మ, మాధవి నగర్‌కు చెందిన బిందు మాధవి, టెలికాం నగర్‌కు చెందిన వరలక్ష్మిల మెడలో ఉన్న పుస్తెల గొలుసును దొంగలు లాక్కెళ్లారు. వరుసగా ఇళ్లు, వ్యాపార దుకాణాలు, గొలుసు దొంగతనాలు జరుగుతున్నా నిఘా పటిష్టం చేయడం, ప్రత్యేక బృందాలను నియమించడం వంటి చర్యలు కొరవడ్డాయి. బ్లూ కోల్ట్స్, క్యూఆర్‌టీ సిబ్బంది రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు గస్తీ తిరగాలి. ఈ ప్రక్రియ సజావుగా జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. వరుస చోరీలతో దొంగలు పోలీసులకు సవాలు విరుసుతున్నారు. స్టేషన్ పరిధిలోని శివారు కాలనీల్లో రాత్రి గస్తీ అంతంతమాత్రమేనని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గస్తీ సిబ్బందిపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే దొంగలు రెచ్చిపోతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

మహిళలకు కరువైన భద్రత


కోడుమూరులో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

కోడుమూరు రూరల్: దేశంలో మహిళలకు రోజురోజుకు భద్రత కరువైతోందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను నిరసిస్తూ కోడుమూరులోని అంబేడ్కర్ సర్కిల్‌లో సోమవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ కలకత్తాలో వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేయడం సిగ్గుచేటన్నారు. హత్య జరిగి రోజులు గడుస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేయలేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగేష్, రాజు, స్థానిక ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వీరాంజనేయులు, ఇంద్ర, కిశోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

కల్లూరు: మధ్యలో చదువు మానేసినవారు దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ–2 వనజకుమారి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో దూర విద్యపై సంక్షేమ విద్య సహాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పొదుపు సంఘం మహిళలు, సీఆర్‌పీలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని చెప్పారు. అనంతరం దూర విద్య అడ్మిషన్‌లకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు.

గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు


కుందూనది నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో ఆదివారం బహిర్భూమికి వెళ్లి కుందూనదిలో గల్లంతైన గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కోసం పోలీసులు గాలిస్తున్నారు. సోమవారం కుందూనది వెంట ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, గ్రామస్తులు గాలించారు. అలాగే ఎస్‌ఐ గ్రామంలోకి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఏ సమయంలో కుందూనదిలో గల్లతయ్యాడు, నీటి ప్రవాహం ఏ విధంగా ఉంది తదితర విషయాలపై ఆరా తీశారు. కుందూనది వెంట ఉన్న గ్రామాలకు ప్రజలకు తెలియజేశారు. గజ ఈతగాళ్లతో మాట్లాడారు. ప్రస్తుతం కుందూనది ప్రవాహం అధికంగా ఉన్నందున ఇరువైపులా గాలించాలని ఎస్‌ఐ సూచించారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓఆర్డీ రవికిషోర్

కల్లూరు: ఈ నెల 23న నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామి పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 22న మండల వ్యాప్తంగా 4వేల మొక్కలు నాటాలన్నారు. ఉపాధి హామి పథకం కింద గతంలో చేసిన పనులు, ప్రస్తుత పనులు, కొత్త పనులు ప్రతిపాదనాలు, పనులకు సంబంధించిన సోషల్ అడిట్ మొదలగు విషయాలు చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ అచ్యుతానందరెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఓలు మద్దేశ్వరమ్మ, రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 23న గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ రాముడు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో ఎంపీడీఓ పాల్గొన్నారు. అనంతరం ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ తదితర గ్రామ స్థాయి అధికారులతో నిర్వహించి సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి గ్రామ పంచాయతీల తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్విరాజ్, టీఏలు, సెర్ప్ ఏపీఎం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన జెడ్పీ చైర్మన్

కర్నూలు(అర్బన్): గుజరాత్ రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన శిక్షణకు జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు మన రాష్ట్రం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ శ్రీలేఖ, కాకినాడ జిల్లా ప్రాతిపాడు ఎంపీపీ గొల్ల క్రాంతికుమార్, బాపట్ల డీఎల్‌డీఓ చంద్రసువార్త, ప్రకాశం బీడీఓ జీ.నితిన్, వైఎస్సార్ కడప ఎంపీడీఓ ఎస్.దివిజ పాల్గొన్నారు. ఈ శిక్షణ ఈ నెల 23వ తేదీ వరకు జరగనుంది. కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను గుజరాత్‌లోని ఐఆర్‌ఎంఏలో నిర్వహిస్తున్నారు. మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా సమర్థవంతమైన పంచాయతీ పాలన కోసం నాయకత్వ, నిర్వహణ నైపుణాలను అప్‌గ్రేడ్ చేసేందుకు ఈ శిక్షణా కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో గ్రూప్ చర్చలు, కేస్ స్టడీస్, ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్, ఇంటరాక్టివ్ ఉపన్యాసాలను నిర్వహిస్తున్నారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పత్తి రైతులు పైరు సంరక్షణకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని ఏఓ మండల సూచించారు. మండల పరిధిలోని చింతమానుపల్లె, తిమ్మందొడ్డి, సంగాల, పలుకుదొడ్డి గ్రామాల్లో సోమవారం ఏఓ పర్యటించారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ పత్తి రైతులతో మాట్లాడుతూ గులాబీరంగు పురుగు ఉధృతిని గుర్తించేందుకు ఎకరాకు ఐదు నుంచి పది వరకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బుట్టలలో పడే గుడ్డిపూల ఆధారంగా మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అనంతరం చింతమానుపల్లె, సంగాల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఏఏలు అసీఫ్, ప్రవీన్, సంధ్యారాణి, ఎంపీఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు పట్టణాభివృద్ధికి కృషి


పూడికతీత పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం

కోడుమూరు రూరల్: గూడూరు పట్టణాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం గూడూరులో స్వచ్ఛ భారత్‌లో భాగంగా చర్చి దగ్గర ఉన్న వంకలో పూడికతీత పనులను నగర పంచాయతీ అధికారులు చేపట్టారు. ఈ పనులను చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయరాదని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు రవికుమార్, కల్యాణి, కౌన్సిలర్లు లక్ష్మన్న, నందకిశోర్, మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యాలు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.